# ప్రకృతి

అరటిపండు సహించకపోవచ్చు, గడ్డపెరుగు రుచించక పోవచ్చు, లేక టెర్రిలిన్ దుస్తుల్ని చూసి అసహ్యించుకో వచ్చు—

కానీ—

"మీరెన్నైనా చెప్పండి, పూలంటేమాత్రం నాకు తగని చిరాకు మాష్టారూ" అనటం వింతగానే అనిపించింది సారథికి.

అందునా, ఈ కుసుమాల సౌకుమార్యాన్ని కొల్లకొన్న అతివే ఈ మాటలనగా విని ఆశ్చర్యంపొందని వారుంటారా?

వైదేహి మాటలు సారథికి ఎంతటి ఆశ్చర్యాన్ని కలుగజేసినాయో, రఘుమాటలూ అంతకంత ఆశ్చర్యం కలిగించినై.

"పోరా, నీకన్నీ వింతలే. పూలని లైక్ చేయని ఆడవాళ్ళు చాలామంది తెలుసు నాకు. ఆడవాళ్ళ బ్యూటీ అలాంటివాటిని డిజ్‌లైక్ చేయటంలోనే వుందసలు!"

"ఆఁ" అని కనుబొమలు పైకెత్తి, కళ్ళు పెద్దవిచేసి, తల ప్రక్కకు వంచి రఘును చూడటంకన్నా ఏమీ చేయలేక పోయాడు—అతివల అంతరంగాలు, ఆంతర్యాలూ అర్థం చేసుకోలేని సారథి.

—ఇది ఐదేళ్ళక్రిందటి ఘటన.

ఆపైన శిష్యురాలి మనస్సు దొంగిలించిన గురువుకూ, ఆమెకూ చెరొక గుదిబండనూ వేయించి—పెద్దమనిషిగా నలుగురిచే పొగడబడినవాడైనాడు రఘు.

—ఇక, వర్తమానంలోని వైదేహి ఐదేళ్ళకిందటి వైదేహి కాదు. పూల విషయంలోనే కాక, అలాంటి అనే కానేక అభిరుచులలో వూహించలేని మార్పులకు లొంగి పోయి సంసారాన్ని చక్కదిద్దుకుంటున్న గృహిణి.

భర్త అనురాగానికి మురిసి. తన అధికారం, ప్రేమ, ఆప్యాయత, ఆదరణ, అణకువలతో అతన్ని మురిపించే వైదేహికి చేదోడు—ఆమె చెల్లెలు విజయ. విజయ-అక్కా బావల యింట్లోవుండి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థిని. చదువుతున్నది తొమ్మిదో తరగతి!

విజయ అద్దంముందు నిలబడి అక్క వేసిన జడను సరి చేసుకుంటున్నది. తనపని పూర్తిచేసుకుని వెనుతిరగబోయిన విజయ, అంతలోనే మళ్ళీ అద్దంలోకిచూసి మూతి ముడుచు కుని విసురుగా వెనక్కు తిరిగింది.

ఏమీ తెలీని వాడులా, ముసి ముసినవ్వులు నవ్వుతూ పేపరు చదువుతున్న బావను చూసేసరికి కోపం వచ్చింది

విజయకు. తన పక్కన తీక్షణంగా నిలబడ్డ విజయవంక క్రీగంట చూసేడు సారథి.

"ఎందుకు నావైపలా చూస్తావ్?"

సారథి వులిక్కిపడ్డాడు. తలెత్తి విజయవైపు చూసి నవ్వి, పేపర్లో తలదూర్చాడు. విజయకు వుడుకుమోత్తనం హెచ్చింది. కోపంగా కాళ్ళు నేలమీదకొడ్తూ 'హుఁ' అని నిట్టూర్చింది.

'స్నానానికి కదలవేమే?' అంటూ వచ్చింది వైదేహి.

'చూడవే.... అక్కా! బావే....' సారథి చూపులు విజయను ఆపైన మాట్లాడనీయలేదు. భర్తవైపు ఏమిటన్నట్లు చూసింది వైదేహి.

'అదికాదు విజ్జీ. నువ్వు అద్దంముందు నిలబడి పావుగంటసేపు పూలు, జడ సరిచేసుకోవటం చూసేసరికి మీ అక్క విషయం గుర్తుకొచ్చింది. నీకు తెలీదేమో, నీ ఈడులో మీఅక్క పూలు అంటే తగని చిరాకుపడేది.'

'పడితే పడింది. మరి నావైపెందుకూ అలా చూస్తావ్!'

వైదేహికి విషయం కొంతవరకు అర్థమైంది. బావ మరదళ్ళకు ఇలాంటి కీచులాటలు ఎక్కువయినాయీమధ్య. 'దానిజోలి మీకెందుకండీ' అంటే ఆయన వినరు. 'బావ పెద్దవారు అలా మాట్లాడకూడ' దంటే అది వినదు. 'రోజు రోజుకీ మరీ పసిపిల్లలతంతుగా మారుతున్నది వీళ్ళ సరాగం.

'పదవే, పద స్నానానికి' అని అక్కణ్ణుంచి కదిలింది వైదేహి విసుగ్గా.

బావవైపు గుబ్బుగ చూసి అక్కను అనుసరించింది విజయ.

సారధి తనలో తాను నవ్వుకున్నాడు. అతనిమనస్సులో ఏవేవో భావాలు, వాటి నాధారంగా చేసుకుని ఆలోచనలు—తీగెలు సాగినై. నిన్న మొన్నటివరకూ తనముందు గాన్లు తొడుక్కున్న విజయ, తనతో సైకిలు మీద స్కూలుకు వెళ్ళిన విజయ ఇప్పుడు పరికిణీ, జాకెట్టు కడుతున్నది. ఆమె ఆకారంలో ఎంతమార్పు? పిచ్చుకపిట్టలా యింత వుండేపిల్ల ఎంతలో ఎంత ఎదిగింది? నిన్న మొన్నటివరకూ అక్కయ్య ఎగ్గా జడవేస్తే అలా వుంచుకునే విజయ ఇప్పుడు తన యిష్టా యిష్టాలను బహిర్గతం చేస్తోంది. అందంగా, ఆకర్షణీయంగా వుండాలని ప్రయత్నిస్తోంది. ఆమె స్వరూపంలో, స్వభావంలో గోచరిస్తున్న మార్పు తనను చకితుణ్ణిచేస్తోంది.

విసురుగా వేసిన తలుపుచప్పుడుకు తుళ్ళిపడిచూసేడు సారధి. విజయ స్నానంచేసి వచ్చి 'డ్రెస్' చేసుకుంటోంది కాబోలు!

'ఏఁవండీ! ఇవాళన్నా గుర్తుంటుందా?'

వైదేహి ప్రశ్నకు 'ఏఁవిటీ!' అని ఎదురు ప్రశ్న వేశాడు సారధి.

'అబ్బబ్బ! ఇంత మతిమరుపయితే ఎలాగండీ........

వారంరోజుల్నుంచీ రోజూ చెప్తూనేవుంటినిగదా! విజ్జీకి ఓణీలు పట్టుకురమ్మని....'

'ఓహ్హో! అదా! అలాగే ఇవ్వాళ తప్పకుండా తెస్తాను.'

"ఆ.... ఏం తేవటమో, ఏమో నాకు మాత్రం అదలా స్కూలుకు వెళ్తుంటే మహా సిగ్గుగావుంది. పైగా మన పక్కింటి పిన్నిగారు అడగనుకూడా అడిగింది."

"ఏమనీ?" సారథి కుర్చీలో ముందుకుజరిగి, వైదేహి కళ్ళల్లోకి చూస్తూ ఉత్సాహంగా అడిగేడు.

సారథి వుత్సాహాన్ని చూసేసరికి నవ్వొచ్చిందివైదేహికి. అతనివైపు అదోలాచూస్తూ 'ఆఁ........పోదురూ మీకన్నీ పరిహాసాలే. ఏమంటుందీ, ఆ పిల్లకు లేకుంటే లేకపోయె. మీకన్నా వుండొద్దుటమ్మా సిగ్గు' అని అంది.

సారథి గొల్లున నవ్వేశాడు. వైదేహి బిత్తరపోయింది. విజయ అక్కడికివచ్చి అక్కా బావల్నిచూసి అలాగే నిలపోయింది. సారథి నవ్వు నాపుకుంటూ, విజయ నుద్దేశించి అన్నాడు, చూసేవా విజయా మీఅక్కయ్య ని న్నేమంటున్నదో?'

బావ మాటలకు అక్కవైపు చూసింది విజయ, 'ఏమి' టన్నట్లు. వైదేహి మాట్లాడలేదు.

సారథే అన్నాడు, "నీకు........సిగ్గులేదని ప్రక్కింటి పిన్నిగా రన్నారుట,"

విజయ మొహం వాడిపోయింది. బావ 'కామెంట్' అర్థంకాక తనను తాను కిిందినుంచీ పైదాకా చూసుకుంది. ఇంతలో వైదేహి ఆ విషయం మార్చేస్తూ, 'విజీ, నువ్వు పోయి అన్నంతిను. పద.... ఈయనగారికేం కూర్చుని ఎన్ని ఉపన్యాసాలైనా యిస్తారు. పదింటికి వంట కాకబోతే మళ్ళీ మనకే అక్షింతలు."

విజయ, సారథివైపు అయోమయంగాచూస్తూ వంటింట్లోకి నడిచింది. చెల్లెలు లోపలికి వెళ్ళగానే అందుకుంది వైదేహి, 'ఏఁవిటండీ మీమాటలూ మీరూను. దానిముందలా మాట్లాడతారేం? ఏవనుకుంటుందో ఏమోననైనా ఆలోచించరేం? బొత్తిగా అమాయకులైపోతున్నారేం!'

"ఏంచేస్తాం అలా తయారుచేస్తున్నావ్!" చిత్రంగా చేతులుతిప్పేడు సారథి.

"చాల్లెండి" అని "ఇంతకీ నేచెప్పింది మఱచిపోరు గదా!" అంటూ అక్కణ్ణుంచీ కదిలింది వైదేహి.

సారథి తన మాటలకు బాధపడ్డాడు. విజయముందు మరీ తెలివితక్కువగా మాట్లాడేడనిపించిందతనికి. అంతలోనే ప్రక్కింటి పిన్నిగారు విషయంమీదికి మళ్ళింది ఆలోచన. తమ స్వంతవిషయాల్లో వాళ్ళకెందుకో ఈ ప్రమేయం? తమ పిల్ల అవసరాలు తాము చూసుకోరా?- కాకుంటే తనఅశ్రద్ధ వల్ల నాలుగురోజులు ఆలస్యమైంది. అంతమాత్రాన మొహాన పట్టుకుని అడిగేయటమే. వైదేహి కనుక వూరుకుంది. తనైతేనా?-

అపును తానైతే ఏం చేసేవాడు ?-

సారథి నవ్వుకున్నాడు. తానైతే వైదేహి మాత్రం కూడా మాట్లాడి వుండేవాడుకాడు. ఆమె తప్పకుండా ఏదో సాకు చెప్పేవుండి వుంటుంది.

సారథి ఆరోజుసాయంత్రం తన మతిమరుపును మెదడు నుంచి విదిలించేసుకుని, విజయకు కొత్తదుస్తులు తెచ్చాడు. విజయ అవన్నీచూసి మురిసిపోతూ సారథి నుద్దేశించి అన్నది. "నీ సెలక్షన్ చాలా బాగుంది బావా. మరీ ఈడిజైనువుంది చూశావ్ అబ్బ ఎంత బావుందో" చిత్రంగా కళ్ళు త్రిప్పి ఒక ఓణీ తీసి చూసింది.

'ఆఁ మీ బావకేం తెలుసే. ఏవరో ఫ్రెండుని తీసుకువెళ్ళుంటారు తనకు తోడుగా' అంటూ లోపలికి వెళ్ళిపోయింది వైదేహి.

సారథి నవ్వేసి విజయవైపు పరీక్షగాజూశాడు. బావ అదోలా తనవైపు చూస్తూవుండటం గమనించి విజయ సిగ్గుపడింది. అతని దృష్టినుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తూ ప్రక్కకుతిరిగి కూర్చుని గునుస్తూ అన్నది. 'అక్కయ్యా! నే నిప్పుడే ఈఓణీ వేసుకుంటానే.'

ఫకాలున నవ్వేడు సారథి. విజయకు రోషంవచ్చింది. కోపంగాలేచి అతనివైపు తీక్షణంగాచూసి లోపలికి వెళ్ళింది విజయ.

"అదేవిఁటే ఇప్పుడు వేసుకోవటమేమిటే- రేపు ఉదయం తలంటుకుని కట్టుకుందువు గాని" అంటోంది వైదేహి.

విజయ తన ఆంతర్యాన్ని పసిగట్టిందని గ్రహించాడు సారథి. తానలా సూటిగా చూసేసరికి సిగ్గుపడి ఆవేళే వోణీ వేసుకుంటానంటున్నది. పిచ్చిపిల్ల!

తనపట్ల బావ ప్రవర్తన అదోలా వుండటం -- తన వైపు ఎప్పుడూ తదేకంగా చూస్తూ ఏదేదో ఆలోచిస్తూ కూర్చోటం, యివన్నీ విజయకు అర్థంకాలేదు. బావ తన నెందుకలా ఉడికిస్తున్నట్లు? క్షణక్షణానికీ తనవైపుచూసి తనలో తను ముసి ముసి నవ్వులు నవ్వుకోవటం దేనికి?-

తన ఆలోచనలను, తనకు కలిగిన సందేహాలను అక్కయెదుట బహిర్గతం చేసిచూసింది విజయ. కాని వైదేహి తేలిగ్గా నవ్వి, పోవే పిచ్చిపిల్లా! ఏఁవిటీ నీ అనుమానాలు, ప్రశ్నలూను? ఎదిగీ ఎదగని మరదలువుకదా. అందుకని ఆటలు పట్టిస్తున్నార్లే!' అన్నది. అక్కయ్యెంత తేలిగ్గా తన మాటల్ని తీసేసినా, విజయకు మాత్రం ఆలోచన తీరలేదు. ఆమె కిప్పుడు బావ ఎదుటకు పోవాలంటేనే సిగ్గుగా వుంది. బావ చేష్టలవల్ల తన ఆకారంలో వస్తున్న మార్పు తనకే ఆశ్చర్యాన్ని కలిగించసాగింది విజయకు.

సారథి మనస్తత్వం తెలిసిన వైదేహిమాత్రం బావా మరదళ్ళ ఆలోచనలు సరదాగా, తనకు కాలక్షేపంగా ఉన్నాయిలెమ్మని తృప్తిపడింది.

ఆవేళ సాయంత్రం—

సారథి ఇంటికి రాగానే ముసిముసి నవ్వులతో వాకిట్లో నిలబడివుంది వైదేహి. ఏదో విశేషం వుండి వుంటుందను

కుంటూ లోపలికివచ్చేడు సారథి. సైకిల్ని వసారాలో గోడ కానించి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

గది తలుపులు వేసివుండటం చూసి ఆశ్చర్యపోయాడు సారథి. భార్యవైపు సాలోచనగా చూసేడు. వైదేహి చేతులు కట్టుకుని నిలబడివుంది. ఆమె పెదవులమీది మందహాసం మాత్రం సారథి మనస్సును గిలిగింతలు పెడుతోంది.

'వెళ్ళి చూడిండి. ఏంవిటలా ఆశ్చర్యపోతారు?'

సారథి లోపలికి వెళ్ళాడు—

ఆశ్చర్యం!

విజయ గదిలో ఓ మూలగా గుడ్డమీద కూర్చుని తలవంచుకుని ఏదో పుస్తకం చదువుకుంటోంది. సారథికి అర్థమైంది.

బావ రాకతో విజయ తొట్రుపడి పైట సరిచేసుకుని సిగ్గుగా ఒదిగికూర్చుంది. డ్రెస్ ఛేంజ్ చేసుకుని విజయవైపు నవ్వుతూ చూసేడు సారథి అంతలో అతని చూపులు గది గుమ్మందగ్గర నిలబడిన వైదేహిమీదికి మరలినై.

"ఏంవిటి వైదేహీ! అంత సంబరపడిపోతున్నావ్?'

'సంబరం కాకేంవిటండీ! ఎంత సరదాగావుందీపూట. నలుగురు పెద్ద ముత్తయిదువులు యింటి కొచ్చేసరికి కళకళ లాడిపోయిందె మన యిల్లు.'

'ఏం విజయా! మొత్తానికి పెద్దమనిషివై పోయావ్. ఇంక నే చెప్పిన పనేమీ చెయ్యవు కాబోలు' విజయను చూస్తూ అడిగేడు సారథి.

విజయ సిగుపడింది. ఏఁవీ మాట్లాడలేక పోయింది. క్రీగంట బావనుచూచి తలవంచుకుని పైటకొంగును ముడి వేయసాగింది.

'అది చెయ్యకపోవటం కాదు. మీారే ఏఁవీ చెప్ప కూడదు.'

వైదేహి మాటకు నవ్వి 'చిత్తం దేవీ' అన్నాడు సారథి.

'విజయకి బాధ్యతలు పెరుగుతాయి కాబోలు యిక.'

'యేం?'

వైదేహి ప్రశ్నకు చిలిపిగా ఆమె కళ్ళల్లోకి చూసి, 'యేమా! ఐదేళ్ల వెనిక్కి నడిచిచూడు, యేఁవిటో, ఎందుకో తెలుస్తుంది' అన్నాడు సారథి.

'పోదురూ! ఎప్పుడూ నన్ను దెప్పటమే. అక్కడికి మీారో పెద్ద బుద్ధిమఁతుల్లాగా'

'కాదా మరి. ఏం విజయా—నువ్వు చెప్పు. ఇంటి కొచ్చి పావుగంటయినా, నా నోరు తియ్యబడక పోయినా యిలా కూర్చున్నానా లేదా? ఇంతకంటే బుద్ధి మంతతనం యింకేఁవిటి?'

సారథి మాటకు గబగబా లోపలికెళ్ళింది వైదేహి.

'అదేఁవిటి విజయా ! మరీ అంత సిగ్గులబరిణవై పోతున్నావేం ? నేనేం పరాయివాణ్ణి కాదు. సరే నే వెడ్తున్నా గానీ సరిగా కూర్చో పాపం' అంటూ లోపలికినడిచేడు సారథి.

విజయ మనసు చిత్రమైన భావాలకు లోనైంది ఆ క్షణములో. బావను చూడగానే శరీరం సిగ్గుతో కుంచించుకు పోయింది. ముఖమంతా కంది ఎఱ్ఱనై నట్లుతోచింది. చిరు చెమటలు క్రమ్మేయి. అయినా, బావ తనవైపు చూడటం, తనతో మాట్లాడటం— తనకేదో వింత అనుభూతిని కలుగ జేసినై.

'మొత్తానికి పెద్దమనిషి వైపోయావ్' అన్నాడు బావ. విజయకు నవ్వొచ్చింది. ఆ నవ్వులో గర్వం తొంగిచూసిందని విజయకు తెలియదు. ఒకటిమాత్రం గ్రహించ గలిగింది. తనలో క్రొత్తక్రొత్త ఆలోచనలు చెలరేగి తనను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

విజయ మనసులోని ఆలోచనల్లాగే రోజులు ఒకదాని తర్వాత ఒకటి దొర్లిపోతునై,

విజయలో ఏదో మార్పు వస్తోందని గమనించింది వైదేహి. తన అనుభవంతో విజయలోని మానసికపరిణామాన్ని అర్థం చేసుకొందామె. తానా వయసులో సారథి మేస్టారివద్ద పాఠాలు చెప్పించు కుంటున్నప్పుడు తనలో ఎన్నెన్ని భావ సంఘర్షణలు బయలుదేరాయో గుర్తుచేసుకుంది. సమాధానం కనపడని ప్రశ్నలూ,పరిష్కరించుకోలేని సమస్యలూ వుత్పన్నమాతూ వుండే వావయసులో. తన

మనోభావాలు కనిపెట్టినట్లుగా సారథి - ఒక్కొక్కప్పుడు గూఢంగా, సూచన ప్రాయంగా సంభాషిస్తూ వుండేవాడు. ఇప్పుడు విజయకు అలా ఎవరైనా .... .... ....

" అబ్బబ్బా. ఈ ఆడవాళ్ళతో గొప్ప చిక్కొచ్చి పడిందే. కాస్త వోణీలు వేసుకునే వయస్సొస్తే చాలు, ఇక మన లోకంలో వుండరు. ఎంతపిలిచినా పలకరు. ఆ ఆలోచనేమిటో, ఆ సమాధి ఏమిటో ? — "

'ఎవరిమాట మీరనేది ?' ఆలోచనల్లోంచి తేరుకుని అడిగింది వైదేహి.

'నువ్వుమాత్రం ఈ లోకంలో వుంటేగదూ ?'

" మాతో ఏంపని మీకిప్పుడు? " విసుగ్గానే అంది.

"అవున్లే మాకు మీతో పనేమిటి! ఎవరికి ఎవరితో పనో కాసేపుంటే తెలుస్తుందిలే' అంటూ సారథి గదిలోకి వెళ్ళేడు.

బావ మాటల్ని విన్న విజయ పెదవులమీద చిరునవ్వు విరిసింది. తెలిసీ తెలియని భావాల్లో వూగిపోయిందిహృదయం.

వైదేహి భర్త ననుసరించింది. 'ఏఁవిటండీ విశేషం?' లాలనగా అడిగింది.

సారథి కొంతసేపు భార్యను వుడికించి చెప్పాడు,'రేపు మీ నాన్నగారు వస్తున్నారట — విజయను తీసుకువెళ్ళటానికి'

'విజయనా, దేనికీ ?'

'నాబోటి అమాయకు డెవడో దొరికేట్ట- చూపించటానికి'

వైదేహి నవ్వుకుంది. కళ్ళలో సంతోషం వెలుగుల్ని నింపింది. 'పాపం, మీరు మహా అమాయకులు' అని, 'ఉండండి, విజయకు చెప్పొస్తాను' అంటూ వెళ్ళిపోయింది.

*　　　*　　　*

తండ్రి మర్నాడు వస్తున్నాడని అక్కద్వారా తెలుసుకుంది విజయ. ఆయనెందుకు వస్తున్నదీకూడా తెలుసుకుంది.

పెళ్ళిచూపుల తంతునుగురించి తలచుకునేసరికి సిగ్గు శరీరమంతా ప్రాకుతోంది. అంతలోనే అసహ్యమూ వేసింది- పెళ్ళికుమారుని తరఫువారు పెట్టే పరీక్షల్ని వ్యూహించుకుంటే. సినిమాల్లోలాగా డాన్సుకూడాచేసి చూపమంటారేమో?-

విజయ సన్నగా నవ్వుకుంది. సినిమాఅంటే గుర్తొచ్చింది - కొత్తసినిమా చూసివెళ్తే బాగుంటుందని. లేచి అక్కనూ, బావనూ అడగటానికి వెళ్ళింది.

'అక్కా యివాళ సినిమాకు వెళ్దామే.'

వైదేహి అల్లుతున్న లేసును ప్రక్కన పడేసి 'ఏం సినిమాకి?' అంది ఉత్సాహంగా.

విజయ చెప్పింది. వైదేహి సారథివైపుతిరిగి 'ఏవండీ, వెళ్దామా?' అంది.

చదువుతున్న పత్రికను కొంచెం ప్రక్కకు పెట్టి వైదేహివైపు తదేకంగా చూసేడు సారథి. ఆచూపులతో

ఏం సమాధానం చెప్పాడో ఏమో, వైదేహి విజయతో 'మేము రాములేవే, నువ్వు వెళ్ళిరా' అని మళ్ళీ తనపనిలో నిమగ్నురాలైంది. విజయకు కోపం రాలేదుగానీ విస్మయం కలిగింది. అక్కయ్య బావను అడగటమేమిటో, ఆయన సమాధానంగా అలా చూడటమేమిటో అంతా ఆశ్చర్యంగా తోచింది. హిప్నాటిజం అంటే ఇదే కాబోలు అనిపించినా లీలగా, జాలుగా ఏదోభావం ఆమె మనోయవనికమీద కదలాడింది.

—సినిమా చూస్తున్నదన్న మాటేగానీ మనసంతా అక్కా బావల మూగభాష గురించే ఆలోచించసాగింది. కాని, సినిమాలోకూడా అలాంటి సంఘటనలు ఒకటిరెండు వుండటంతో— ఆభాష కొంత వయసొచ్చిన స్త్రీ పురుషుల కందరికీ తెలిసినదేననీ, ఏ వొక్కరికీ ప్రత్యేకించినది కాదనీ అర్థంచేసుకుంది. అంతేకాక, మరోవిషయం తెలుసుకుంది— తనుకూడా ఆవయసుకు వస్తోందని. ఇంటర్వెల్ నుంచీ సినిమాలో క్రొత్తవిషయం ఒకటి గమనించింది విజయ. అంతవరకూ బాలికగావున్న అమ్మాయి హఠాత్తుగాయువతిగా మారి కూర్చుంది. క్రొత్తగా యౌవనంలో అడుగిడిన ఆ అమ్మాయికి నిత్యజీవితంలో తారసపడే వ్యక్తులందరూ క్రొత్త క్రొత్త రంగుల్లో కనిపిస్తారు. మామూలుగా మాట్లాడుకునే మాటల్లోకూడా చిత్రమైన అర్థాలు తోస్తాయి. ఒంటరిగా ఉన్నప్పుడు ఎన్నోమధురోహలూ, భావాలూతోచి మనసును వుక్కిరి బిక్కిరిచేస్తాయి. ప్రకృతినిచూసి ఆమె హృదయం

పరవశించిపోతుంది. ఆ దృష్ట్యా సినిమా ఎంతో సహజంగా కనిపించింది.

సినిమా వదిలిన తర్వాత ఒక్కతే రిక్షాలో వస్తోంది విజయ. మూడుగంటలసేపు క్రిక్కిరిసినహాల్లో కూర్చుని యివతలకు రావటంవల్ల కాబోలు రిక్షాకు ఎదురుగా వీచే చల్లని గాలి మనసుకు, శరీరానికి హాయిని కలిగిస్తోంది,

'ఆహా! ఎంత హాయిగా వుందిరా పిల్లగాలి. అసలీ గాలికి టీ నేజర్సంటే ఎంత సరదా అనుకున్నావు. ఉండు ఒక్కసారి ఆ వెన్నెల వెలుగుల కళ్ళని చూడనీ'

విజయ ప్రక్కకు తిరిగింది. రిక్షాలో ఎవరో కుర్రాళ్ళిద్దరు మాట్లాడుకుంటూ వెడుతున్నారు. కొంచెంముందుకు వెళ్ళినతర్వాత 'బ్యూటీ' అన్నాడొకడు.

విజయ తనవైపోకసారి చూసుకుంది. తెల్లని షిపాన్ వెన్నెల్లో మెరసిపోతోంది. 'నిజమే మధురభావాలతో నా కళ్ళల్లో వెలుగులు నిండాయి' అనుకుని సంతృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

*　　　*　　　*

'విజయ వచ్చే వేళయింది'

'ఏం వస్తే నాకేం. పెద్దదైపోయిందిగా. మనసరాగం చూసి ఎన్నెన్నో క్రొత్త విషయాలు తెలుసుకుంటుంది.'

'నిజమే! మీకేముంది! సిగ్గుతో కుచించుకుపోయేది నేనేగా!'

'విజయ అలా ఏం అనుకోదుగాని మీ చెల్లెల్ని చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యం వేస్తోంది వైదేహీ. ఎంతలో ఎంతదైపోయింది. పైగా మాటల్లో, చేతల్లో ఎంత మార్పొచ్చింది.'

'ఆడపిల్లలంతే.'

'అవును ఇంతే'—అని చిలిపిగా నవ్వు.

'ఊఁ హూఁ.'

—విజయ అక్కయ్యను పిలుద్దామని తలుపు తట్టబోయింది. కాని తలుపు తీసివుండటంతో ఒక్కసారిగా తెరచుకుంది.

వైదేహి కొప్పునిండుగా మల్లెలు విరగబడి నవ్వుతున్నాయి. ఆ మల్లెల సువాసనల్ని ఆఘ్రాణించటానికి కాబోలు వైదేహి తలమీదికి సారథి వొంగటం, తలుపులు తెరుచుకోవటం ఒకేసారి జరిగేయి.

విజయ క్షణం అలాగే చూసింది. శరీరం గగుర్పొడిచింది. అంతలో సారథి, వైదేహి తొట్రుపడి అవతలికి జరిగి కూర్చున్నారు.

విజయ హుటాహుటిని తన గదిలోకి వెళ్ళిపోయింది. పూలంటేనే చిరాకుపడే అక్క పెళ్ళయినతర్వాత పూలు పెట్టుకోవటాని కెలా అలవాటుపడిందో ఇప్పు డర్థమైంది విజయకు. 'మనసును దోచిన మగవారికోసం మగువలు ఎంతగా మారగలరు' అనుకుంది.

విజయ అటు వెళ్ళగానే సారథి కొంటెగా వైదేహి కళ్ళలోకి చూసేడు. వైదేహి సిగ్గుపడి లేచి చెల్లెలిగదిలోకి వెళ్ళింది.

*　　　*　　　*

వెళ్ళి చూపులకని పుట్టింటికి వెళ్ళిన విజయ ఏకంగా వేసవి సెలవులైపోయేవరకూ అక్కడే వుండిపోయింది.

*　　　*　　　*

'ఇదిగో! ఏమోయ్! వైదేహీ! ఏఁవిటీ అప్పుడే నిద్రపోతున్నావు? లే'

ఆమె లేచింది. పెద్దలైట్ స్విచ్ వేసింది. క్రీమ్‌లైట్ కాంతి గదినంతా ఆవరించింది.

సారథి ఒక్కసారి ఆమెవైపు చూచి అప్రతిభుడై పోయేడు.

'ఏఁవిటి బావా! అలా చూస్తావు?'

'నువ్వు....నువ్వు విజయవికదూ? ఎప్పుడొచ్చేవ్?' మాట తడబడ్డాడు.

విజయ కిలకిలా నవ్వింది. అంతలో వైదేహిఅక్కడికొచ్చింది.

'ఏఁవిటీ విజ్జీ?'

'బావకు మాటలు రావటంలేదే!'

'ఛా.... అదేఁవిటే!'

'నిజం! ఏం జరిగిందో తెలుసా? బావ వచ్చేసరికి నేను నీ మంచంమీద పడుకొని వున్నాను. నేను నీవే నను కున్నాడు కాబోలు 'ఇదుగో, ఏమోయ్, వైదేహీ' అని ఎంత తమాషాగా పిల్చాడనీ! కొంచెంవుంటే చేత్తో తట్టి లేపేవాడుకూడానేమో?' అని విరగబడి నవ్వినట్లు మొద లెట్టింది విజయ.

సారథి సిగ్గుపడ్డాడు. వైదేహి చెల్లెల్ని మందలిస్తూ అంది 'చాల్లే. చీకట్లో కనపడక....'

'బల్బ్ జీరోవాట్‌దైనా మనిషిని గుర్తించగలిగే వెలుతురు నివ్వటం లేదంటావా అక్కా?'

'అదికాదు విజ్జీ. దోషం బల్బుదీకాదు, నాదీకాదు. నీదే.'

'నాదా?' ఆశ్చర్యంగా అడిగింది విజయ.

"అవును. ఎందుచేతనంటావా—మూణ్ణెల్లలో నువ్వింతగా మారిపోతావని ఎవరూహిస్తారు చెప్పు. అబ్బో.... అబ్బో ఎంతదానివైనావు! మూణ్ణెల్లలోను నువ్వు చేసినపని ఒక్కటనిమాత్రం తెలుస్తోంది."

"ఏఁవిటది?"

"పెరగటం" సారథి నవ్వేశాడు.

"ఇక చాల్లెండి. అప్పుడే మొదలెట్లారు వేళాకోళాలు, అది వచ్చి గంటకాలేదు" వైదేహి విసుగును వ్యక్తం చేసింది.

"ఇంతకీ పెళ్ళైమైనట్లు ?"

విజయ సిగ్గుపడి పక్కకు వెళ్ళింది. వైదేహి చెప్పింది, 'మొన్ననే ఎవరో చూసివెళ్ళేర్ట. పెళ్ళికొడుకు ఇంజినీర్ట వాళ్ళదగ్గర్నుంచీ ఉత్తరం రాగానే నాన్న మనకు రాస్తా నన్నాట్ట."

"బాగుంది. అయితే, మన విజయ ఇంజనీరుగారి సతీ మణి అవుతుందన్నమాట !"

"మీా నోటిచలవన కానీండి"

"అబ్బా.... అప్పుడే, అమ్మమ్మలా మాట్లాడేవే" అన్నాడు సారథి.

ముగ్గురూ గొల్లున నవ్వుకున్నారు.

* * *

మధురస్వప్నాల్లో తేలిపోతున్న విజయ పెదవులమీాద చిరునవ్వు చిందులు వేస్తోంది. ఆమె మనస్సు ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది.

"ఆ వెన్నెల వెలుగుల కళ్ళనిచూడనీరా !"—

"ఇంత వయస్సొచ్చి, అందాలబరిణెలాగా మారిన అమ్మాయికి ఇంకా చదువేంవిటి ? పెళ్ళిచేసేయమని మీా నాన్నకి రాస్తానుండు"—

"విజయ పెద్దదైపోయింది. మన సరాగం చూసి ఎన్నెన్నో కొత్తవిషయాలు తెలుసుకుంటుది"—

"అయితే, మన విజయ ఇంజనీరుగారి సతీమణిఅవుతుం దన్నమాట"—

—"విజ్జీ....విజ్జీ—లేవ్వే.... తెల్లవారితే యింకావేఁవిటీ నిద్ర ?"

వైదేహి కుదుపుకు ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూసింది విజయ. క్షణంక్రితంవరకు చెవుల్లో మార్మోగిన మాటలు తనకు స్వప్నంలో వినిపించినవని తెలుసుకుందామె.

"విజ్జీ, నీకో శుభవార్త చెప్పనా ?" వైదేహికళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయి. ఏఁవిటన్నట్లు చూసింది విజయ.

"నువ్వనుకున్న సంబంధం కుదిరిందట. ఇదిగో నాన్న టెలిగ్రామిచ్చారు"— అని ఆనందాతిరేకంతో చెల్లెల్ని కౌగ లించుకుంది వైదేహి.

"శుభోదయం విజయా. కంగ్రాట్స్" అంటూవచ్చేడు సారథి.

విజయ సిగ్గులమొగ్గయిపోయింది.

*　　　*　　　*

వివాహమైనవెంటనే విజయను చూసిన సారథి మనస్సులో ఏవేవో భావాలు తీవలుసాగినై. వాటన్నిటి ప్రతి రూపంగా అతని నోటివెంట వెలువడినై ఈ మాటలు— "ప్రకృతి ప్రతిరూపం స్త్రీ. ప్రకృతిసహజమైన మార్పు- స్త్రీకీ సహజమే! అప్పుడే విజయలో గాంభీర్యం తొంగి చూస్తోంది !" *